18వ
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,3 ఏప్రిల్ 2025



## ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్ ప్రమాణ స్వీకారం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

### అత్యంత పారదర్శకంగా

# భూముల రీ-సర్వే

### - అధికారులకు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశం



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిబద్ధత జవాబుదారీతనంతో భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారంలేకుండా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అమరావతి నుండి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎన్ ప్రభాకర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీ సర్వే పైలట్ గ్రామాలు, రెండవ దశ రీసర్వే కార్యక్రమాల సన్నద్ధత,13 నోటిఫికేషన్ జారీ మొబైల్ యాప్, సర్వే బృందం యాప్‌లో లాగిన్ అయ్యే ప్రక్రియ, యాప్‌లో బృంద సభ్యులు పనితీరు, తప్పనిసరిగా విజిబుల్ అయ్యే అంశాలు, నీటి తీరువా వసూళ్లు, ఇత్యాది అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం నీటి తీరువా వసూళ్లు ముమ్మరం చేయాలనిఆదేశించిందని,ఆమేరకు ప్రక్రియను వేగవంతం చేయాలనిసూచించారు.పైలెట్ గ్రామాలలో రిజర్వే ప్రక్రియను పూర్తి చేసి రెండవదశలో మండలానికి రెండు గ్రామాలు చొప్పున సర్వే నిర్వహణకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల రీసర్వే బృందసభ్యులతో కూడిన మొబైల్‌యాప్‌ను రూపొందించిందని, ఈ యాప్‌లో టీమ్‌లో ఉన్న వీఆర్వో గ్రామ మండల సర్వేలు, సర్వే డీటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు సర్వే ఏడి జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ లాగిన్ అవ్వాలని తెలిపారు. ప్రతిరోజు ఈ యాప్ ద్వారా సభ్యులు రీసర్వే ప్రక్రియపై సాధించిన పురోగతిని ఉన్నతస్థాయి అధికారులు పర్యవేక్షించడం జరుగు తుందన్నారు. అదేవిధంగా రీసర్వే డేటా మరియు 6(1)నోటీసులు ఈ యాప్ ద్వారానే సమర్పించాలన్నారు. రైతుల సమ క్షంలోనే రీసర్వే చేయా లని,సంబంధిత రైతుతో పాటు, చుట్టు ప్రక్కల రైతులనుకూడా పిలవాలని సూచించారు. భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిబద్ధతతో భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా

- తరువాయి 2లో..

### రైతు నేస్తం

# కూటమి ప్రభుత్వం



### - రైతులకు సబ్సిడీ పవర్ టిల్లర్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వం రైతునేస్త ప్రభుత్వమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద లబ్దిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రావులపాలెం మండలం కొమరాజులంక గ్రామానికి చెందిన రైతు జక్కంపూడి సూర్యచంద్రరావు, పొడగట్లపల్లి గ్రామానికి చెందిన రైతు కలిగినీడి వెంకటేశ్వరరావు, దేవరపల్లి గ్రామానికి చెందిన రైతు విత్తనాల సత్యవతి, మట్టా రామాంజనేయులు లకు సబ్జిడీపై పవర్ టైలర్, పవర్ రీడర్ ను అందజేసినట్లు తెలిపారు. 2 లక్షల 29 వేల 5 వందల రూపాయల పవర్ టిల్లర్ కు ప్రభుత్వం ఒక లక్ష రూపాయలు సబ్సిడీతో రైతులకు

- తరువాయి 2లో..

## అగ్నిపథ్ స్కీమ్ కింద 2025-26 రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

### -దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఏప్రియల్ 10

### - కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** అగ్నిపథ్ స్కీమ్ కింద 2025-26 సంవత్సరానికి రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. అగ్నివీర్ తీసుకోవడంకోసం ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్ కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం విశాఖపట్నం తెలియజేయడం జరిగిందన్నారు. మార్చి12నుంచి ఏప్రియల్ 10వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలియ చేశారు. దరఖాస్తుదారులు అగ్నివీర్ జనరల్

- తరువాయి 2లో..

### అవాంటెల్ కంపెనీతో

# జెఎన్టీయుకె అవగాహనా ఒప్పందం

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె)లోని ఈసిఈ విభాగం ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్&కమ్యూనికేషన్స్‌లో కొలాబొరేటివ్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు గాను అవాంటెల్ లిమిటెడ్ కంపెనీతో బుధవారం ఉదయం విసి కాన్ఫరెన్స్ హాలు నందు ఎంఓయు కుదుర్చుకుంది. జెఎన్‌టియుకె నుండి ఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్ ప్రొ. కె.వి.రమణ, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావులు విచ్చేయగా అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ నుండి ఛైర్మన్ &ఎండి మరియు జెఎన్‌టియుకె పూర్వ విద్యార్థి డా.ఏ.విద్యా సాగర్, వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) మరియు పూర్వ విద్యార్థి పి.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించి స్వాగతం పలికారు.ఈసందర్భంగాఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ ఒక ప్రముఖ విద్యాసంస్థగా పేరొందడంతో పాటు పూర్వ విద్యార్థులు భారతదేశం మరియు విదేశాలలోచాలా కీలకమైన స్థానాలలో ఉన్నారన్నారు. యుసిఇకె కళాశాలతో ఎంతో ఆప్యాయత కలిగిన పూర్వ విద్యార్థులు నేటి విద్యార్థులకు తమ జ్ఞానాన్ని అందించడంతో పాటు వివిధ అంశాలపై



శిక్షణ ఇచ్చేందుకుముందుకు రావడం ముదావహమన్నారు. యుసిఇకెలో ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం తొలుత 1958లో టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంగా ఏర్పడిందన్నారు. యూనివర్శిటీ నిధులు, ఫండింగ్ ఏజెన్సీల పరిశోధన ప్రాజెక్టులు మరియు ప్రపంచ బ్యాంకు ప్రాజెక్ట్ ఫండ్‌లు (టెక్విప్) ద్వారా నిర్వహింపబడుతున్న ప్రయోగశాలలఅనుసంధానం ద్వారా ఈసిఈ విభాగంలో ఏర్పాటు కానున్న ఎంటెక్ స్నిగల్ ప్రాసెసింగ్&కమ్యూనికేషన్స్ స్పెషలైజేషన్ కోర్సువిజయవంతం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ ఛైర్మన్&ఎండి డా.ఏ.విద్యా సాగర్ మాట్లాడుతూ అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ

- తరువాయి 2లో..

# అవాంటెల్ కంపెనీతో జెఎన్టీయుకె అవగాహనా ఒప్పందం

మొదటిపేజి తరువాయి

విశాఖపట్నం,హైదరాబాద్‌లలో మూడు దశాబ్దాలపాటు భారతరక్షణ సేవలు, అనుబంధ సంస్థలకు అనేక ప్రత్యేకమైన ఉత్పత్తులు అందించడంతో పాటు డిఫెన్స్ ప్లాట్‌ఫారమ్‌ల కోసం సైనిక ప్రమాణాలతో కూడిన పరికరాల రూపకల్పనలో నిమగ్నమై ఉందన్నారు. భారతదేశాన్ని స్వయం ప్రతిపత్తిగా మార్చడానికి ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ డొమైన్‌లలో స్వదేశీ పరిష్కారాలను అందిస్తుదన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హెలీకాప్టర్‌లు, షిప్‌లు మరియు జలాంతర్గాముల మధ్యవాయిస్ మరియు డేటా కమ్యూనికేషన్‌ల కోసం నెట్‌వర్క్ సెంట్రిక్ మొబైల్‌శాటిలైట్ సేవల కోసం అత్యాధునికమైన, వినూత్నమైన, అత్యంత సురక్షితమైన, అనుకూలమైన పరిష్కారాలను అవాంటెల్ కంపెనీ అందిస్తుందన్నారు.

అవాంటెల్ లిమిటెడ్ మరియు జెఎన్‌టియుకెలు స్నిగల్ ప్రాసెసింగ్ & కమ్యూనికేషన్స్ విభాగంలో పరస్పర అభివృద్ధి కోసం నాణ్యమైన ప్రచురణలు మరియు పేటెంట్‌లతో క్రియాశీల పరిశోధనలో పాల్గొనడానికి మరియు కొలాబొరేటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్స్ అందించేందుకు వీలు కలుగుతుందని వారు పేర్కొన్నారు. అవాంటెల్ లిమిటెడ్ అధునాతన డిజిటల్ కమ్యూనికేషన్ లేబొరేటరీ, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ లేబొరేటరీ, రియల్ టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌లతో సిస్టమ్ డిజైన్ మరియు ఎంబెడెడ్ లినక్స్ లేబొరేటరీ, వైర్‌లెస్ కమ్యూనికేషన్ లేబొరేటరీ అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ప్రయోగశాలలతో ఇక్కడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ)ను ఏర్పాటుచేయనుందన్నారు. దీనికి అదనంగా సిగ్నల్ ప్రాసెసింగ్ & కమ్యూనికేషన్స్‌తో ఎంటెక్ ప్రోగ్రామ్ కోసం ఉపయోగించబడే ప్రయోగశాలలను నిర్వహించడానికి అవాంటెల్ లిమిటెడ్ నుండి ఛైర్ ప్రొఫెసర్ మరియు ఇద్దరు అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులను స్పాన్సర్ చేయనుందన్నారు. ఈ ప్రోగ్రామ్‌లో చేరిన విద్యార్థులు జెఎన్‌టియుకెలో మొదటి సంవత్సరం పూర్తి చేసిన తర్వాత ఇంటర్న్‌షిప్స్, పీజీ థీసిస్, ప్రాజెక్ట్‌ను అవాంటెల్ కంపెనీలో చేయవలసి ఉంటుందన్నారు. దీనికి గాను అవాంటెల్ లిమిటెడ్ రూ. 25వేలు స్టైఫండ్ చెల్లించడంతో పాటు కోర్సు విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు రూ. 9లక్షల ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ కల్పిస్తోందన్నారు.

అనంతరం జెఎన్‌టియుకె నుండి రిజిస్ట్రార్ ప్రొ. వి. రవీంద్రనాథ్, ఐఐఐపి&టి డైరెక్టర్ ప్రొ. బి. టి. కృష్ణ, అవాంటెల్ లిమిటెడ్ నుండి ఎండి డా. ఏ. విద్యా సాగర్, వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ఎన్. శ్రీనివాసరావులు ఎంఓయుపై సంతకాలు చేయగా ఉపకులపతి ప్రొ. సిఎస్ఆర్‌కె. ప్రసాద్, అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ ఛైర్మన్ & ఎండి డా. ఏ. విద్యా సాగర్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తదుపరి విసి కాన్ఫరెన్స్ హాలులో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో రెక్టార్ ప్రొ. కెవి. రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి. రవీంద్రనాథ్‌లు మాట్లాడుతూ జెఎన్‌టియుకె మరియు అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఆధారిత కోర్సుగా స్నిగల్ ప్రాసెసింగ్ & కమ్యూనికేషన్స్‌ను అందించడం అభినందనీయమన్నారు. అవాంటెల్ లిమిటెడ్ కంపెనీతో ఎంఓయు కొరకు ఏపిపిఎస్సీ మాజీ ఛైర్మన్ ప్రొ. పి. ఉదయభాస్కర్, మాజీ ఉపకులపతులు ప్రొ. ఎస్. శ్రీనివాసకుమార్, ప్రొ. జి. వి. ఆర్. ప్రసాదరాజు, ప్రొ. కె. పద్మరాజు లు కృషితో ఈ ఎంఓయు జరిగిందన్నారు. ఈ కోర్సులో ప్రతీ ఏటా గరిష్టంగా 25 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఎంఓయు జెఎన్‌టియుకె యూనివర్శిటీలో మొదటిసారిగా ఒక ప్రముఖ పరిశ్రమతో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ)ను ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక ఒప్పందంగా గుర్తించబడిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్, ఈసిఈ విభాగాధిపతి, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు, ఈసిఈ విభాగం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల అప్పారావు కాపు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఇళ్ల అప్పారావు కాపు తమ్ముడు ఇళ్ల వరహాలు ఇటీవల జై కొత్తూరు వద్ద ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వైసీపీ సీనియర్ నాయకులు జ్యోతుల రామస్వామి, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు జనపరెడ్డి బాబు, జె.కొత్తూరు సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు, ఘజింగం సత్తిబాబు దోమల గంగాధర్ చదలవాడ బాబి బండారు రాజా జాన్ వెస్లీ ఉయ్యూరు నాని దుమ్మ శీను తదితరులు పరామర్శించారు. ఇళ్ల వరహాలు మృతి తీరని లోటుని ఆయన కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరహాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తమ్ముడి మృతి పట్ల అప్పారావు కాపును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి..




**ఆలమూరు, మేజర్ న్యూస్ :** రాజమండ్రిలోని జాతీయ రహదారిలో అనుమానస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రమైన ఆలమూరులో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో అనుమానాలను కలిగిస్తున్న పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతుని రోడ్డు ప్రమాదంగా చూడకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన చనిపోవడానికి గల కారణాలు కనిపెట్టి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ మేరకు పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కేజే ప్రకాష్ బాబుకు ఆయన కార్యాలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని సంఘాల పాస్టర్లు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు, మహిళలు, చిన్నారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలమూరుకి సంబంధించిన దక్షిణ భారతదేశంలోనే ఏకైక ఆలయంగా అలలారుతున్న శ్రీ భట్టి విక్రమార్క ఆలయ ప్రధానార్చకుడైన కాళ్లకూరి వారికి తిరుపతి వేదిక్ యూనివర్సిటీ ప్రశంసా పత్రం




**ఆలమూరు, మేజర్ న్యూస్ :** ప్రముఖ శైవాగమ వేద పండితులు కాళ్లకూరి సూరి పండు కి తిరుపతి శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శైవాగమ పండిత ప్రశంసా పత్రం బుధవారం తిరుపతిలో అందజేశారు. గత 21 రోజులుగా జరుగుతున్న ఆన్లైన్ క్లాసుల్లో వేదిక్ యూనివర్సిటీ ద్వారా శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాలలో నిర్వహించడం జరిగింది. ఈ క్లాసులలో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహిం చి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి తిరుపతిలో వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో "ఇంటర్నేషనల్ ప్రశంస పత్రాలతో " పాటు గుర్తింపు పత్రాలను అందించారు

ఈ క్లాసులలో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన కాళ్లకూరి సూరి పండు కి శైవాగమ శాస్త్ర విభాగంలో గుర్తింపు పత్రాలను ప్రశంసా పత్రం లను అందజేశారు. గతంలో 2006లో ఇదే సూరిపండు వారికి టిటిడివిఎస్‌ఎవిఎస్ వారి ద్వారా వార్షిక సత్కార పండిట్‌గా మొదటి సత్కారం అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆలమూరు లో ఉన్న భక్తులు, అభిమానులు, రాజకీయ నాయకులు ఆయనను అభినందనలు తెలిపారు.

## అత్యంత పారదర్శకంగా భూముల రీ-సర్వే

మొదటిపేజి తరువాయి

చేపట్టాలన్నారు. భూముల రికార్డులను పరిశీలించారు. సర్వే నంబర్ల ఆధారంగా రైతు వారీగా భూ విస్తీర్ణం పై ఆరా తీశారు. గ్రామంలోని భూములవివరాలనుసమగ్రంగా తెలియజేస్తూ, రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీసర్వే ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సమగ్ర రీసర్వే లెక్కలు పక్కాగా ఉండాలన్నారు. ప్రతి దశలో చేయాల్సిన పనులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వేలో ఎక్కడా ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా, కచ్చితత్వంతో కార్యకలాపాలు కొనసాగించాలని దశలో అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్ తర్వాత చేపట్టాల్సిన గ్రామ సభలు, గ్రౌండ్ వ్యాలిడేషన్ తదితరాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గ నిర్దేశం చేయాలన్నారు. రైతులకు ఖచ్చితమైన డేటాతో రికార్డులు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. గ్రామంలోని ప్రతి రైతుకు. సర్వే నిర్వ హణ విషయాల్ని నోటీసు ద్వారా యాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. రైతులకు ఏదైనా సర్వే ప్రక్రియపై సందేహాలుంటే క్షేత్రస్థాయి సిబ్బంది నివృత్తి చేయాలన్నారు. వారితో సర్వే విషయమై వారికి నివృత్తి చేయాలన్నారు. గ్రామా లలో నిర్వహించే రీసర్వే సర్వే కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సంబంధిత రైతులకు ముందస్తుగా తెలియజేస్తూ వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించాలని సూచించాలన్నారు. ఈ సర్వేతో రైతులకు ఏవిధంగా కచ్చితమైన కొలతలతో మున్ముందు భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయో రైతులకు వివరించాలన్నారు. రీసర్వే తర్వాత భూహక్కు పత్రాలు తేడా లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల వర్గీకరణతో భూ రికార్డులను డిజిటలైజేషన్ చేయాలన్నారు. సమగ్ర వివరాలతో కూడిన రికార్డులను తయారు చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రికార్డుల తయారీలో రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ విభాగం, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయం వహించాలని, అందరి వద్ద ఒకేలాంటి రికార్డు ఉండేలా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పి. శ్రీకర్, డి. అఖిల, కే. మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కే. ప్రభాకర్, ఎస్‌డిసి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కూటమి ప్రభుత్వం

మొదటిపేజి తరువాయి

పంపిణీ చేసిందన్నారు. అలాగే 76 వేల 5 వందలు రూపాయలు ఉండే పవర్ రీడర్‌ను 30 వేల రూపాయల సబ్సిడీతో రైతుకు అందించినట్టు తెలిపారు. రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే రైతుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీనా కుమారి, ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభి రామారావు, గోపిశెట్టి సత్తిపండు, అల్లూరు పెద్ద కృష్ణంరాజు, కుంచనపల్లి దొరబాబు, సాగర్, వ్యవసాయశాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిపథ్ స్కీమ్ కింద 2025-26 రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

మొదటిపేజి తరువాయి

డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ కేటగిరికోసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ కేటగిరి కోసం 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత నోటిఫికేషన్ ప్రకారం 12 మార్చి 2025 నుంచి ఏప్రియల్ 10 వరకు ప్రచురితమైన నోటిఫికేషన్ జాయిన్ ఇండియన్ ఆర్మీ సైట్‌లో ఉంచడం జరిగిందన్నారు.

అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అగ్నివీర్ల నియామకం ఏ, బి రెండు దశల్లో జరుగుతుందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. (ఎ) ఫేజ్-ఎల్ ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత వ్రాత పరీక్ష (ఆన్‌లైన్ జూన్ 2025 నుండి (తాత్కాలికంగా) ఆంధ్రప్రదేశ్ లోని వివిధ కేంద్రాలలో నిర్వహించబడుతుందన్నారు. (బి) ఫేజ్-2షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులను నియమించబడిన రిక్రూట్‌మెంట్ ర్యాలీ వేదిక వద్ద రిక్రూట్‌మెంట్ ర్యాలీకి నిర్దేశించిన తేదీ మరియు సమయం గురించి తెలియ చేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలియ చేశారు.

# రిజిస్ట్రేషన్ కోసం ఏప్రియల్ 4 నుంచి అందుబాటులో స్లాట్ బుకింగ్

**- స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పించడం జరుగుతుంది**
**- జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** డైనమిక్ క్యూ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు ఏప్రియల్ 4వతేదీ నుంచి అందుబాటులోకి రానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆర్ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలియచేసారు.

రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ రాష్ట్రములో డైనమిక్ క్యూ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అనగా దస్తావేజు దాఖలు చేసుకొనుటకు కక్షిదారులకు అనుకూలమైన సమయము యెంచుకొని ఆ సమయములో రిజిస్ట్రేషన్ సేవలు పొందుటకు ఏప్రిల్ 4వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తముగా 26 జిల్లాలోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలులో అమలు చేయడం జరుగుతుందని జిల్లా రిజిస్ట్రార్ ఆర్ సత్యనారాయణ తెలిపారు.

**-ఇందుకు సంబంధించి స్లాట్ బుకింగ్ ఎలా చేయాలి ?**

పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ద్వారా అధికారిక వెబ్ సైట్ లోని స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా

**-ప్రజలకు చేకూరే లాభాలు :**

-వెయిటింగ్ టైమ్ తగ్గుతుంది, సౌకర్యవంతమైన ప్రణాళిక పారదర్శకత -సిబ్బంది నిర్వాహణ సులభతరం చేస్తూ దస్తావేజులు ముందస్తు పరిశీలన-మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుంది.-అందుబాటులో వుండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు

2025 ఏప్రిల్ 4 వ తేదీ నుంచి రాష్ట్రములోని మొత్తం 26 జిల్లా ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఈ ప్రక్రియ ప్రారంభించడంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కేంద్రం నుంచి ఈ సేవలు అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ స్లాట్ బుకింగ్ విధానం దశల వారీగా విస్తరించ నున్నట్లు తెలిపారు రిజిస్ట్రేషన్ కోసం వెబ్ సైట్ సందర్శించాలని పేర్కొన్నారు.

# తరతరాలకు స్ఫూర్తిదాయకం

# బహుజన చక్రవర్తి సర్దార్ పాపన్నగౌడ్

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** తరతరాలకు స్ఫూర్తి దాయకంగా బహుజన చక్రవర్తి సర్దార్ పాపన్నగౌడ్ నిలిచారని, గౌడలు, బడుగు బలహీన వర్గాల ఉద్ధరణకు ఆయన పాటుపడ్డారని గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు అన్నారు. బుదవారం కొవ్వూరు గామ్ ఇండియా బ్రిడ్జి వద్ద ఉన్న సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు మన్నెం సన్ని బాబు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ముందుగా నాయకులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు మన్నెం సన్ని బాబు మాట్లాడుతూ ఆనాటికాలంలో కత్తులతో పోరాటాలు చేసి మనుగడ సాధించుకున్నామని, నేటి తరంలో విధ్యతోనే ఆర్ధిక స్థితిగతులను మార్చుకోగలమని చెప్పారు. గౌడ కుటుంబాలు ఆర్ధికంగా ఎదగాలంటే పిల్లలను బాగా చదివించాలని సూచించారు. తాత కృష్ణారావు మాట్లాడుతూ ఐక్యతతోనే గౌడ అభివృద్ధి సాధ్యమని అన్నారు. రాజ్యాంగ పరమైన హక్కుల సాధనకు రాజకియ్యంగా సామాజికంగా గౌడలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్, పాకా జయరాం, మార్గాన్ని ఆది నారాయణ, గౌడ నియోజకవర్గ అధ్యక్షులు బొర్రా కృష్ణ,



కొండేటి భిమారావు, మార్గాన్ని చంటిబాబు, ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు, భిమాన ఝాన్సీ రాణి, బొద్దుగా చిన్న శ్రీను, ఆరికిరేవుల సర్పంచ్ మట్టా శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మరిశెట్టి సూర్య ప్రకాష్, మరిశెట్టి మురళి మోహన్, సిద్దగని దుర్గ ప్రసాద్, మట్టా శ్రీను, బుడ్డిగా శ్రీను, సిద్ధగని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ సూపర్ కప్ 2025లో గోల్ కీపర్‌గా

# మెరిసిన ఆదిత్య డిగ్రీ విద్యార్థి జి.నవీన్ కుమార్



**- నవీన్ కుమార్‌ను అభినందించిన**
**అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో బిబిఏ డిజిటల్ మార్కెటింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గింజల నవీన్ కుమార్ మార్చిలో జరిగిన ప్రతిష్టాత్మకమైన ఏపీ సూపర్ కప్2025 పోటీలలో గోల్‌కీపర్‌గా రాణించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి గింజల నవీన్ కుమార్ మార్చి 20 నుండి మార్చి 27 వరకు అనంతపురంలో జరిగిన ప్రతిష్టాత్మక ఆంధ్రప్రదేశ్ సూపర్ కప్ 2025లో గోదావరి తరపున గోల్ కీపర్‌గా అసాధారణ ప్రదర్శన ఇచ్చాడు. గోదావరి ఫుట్బాల్ జట్టువిజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

గోల్‌పోస్టుల మధ్య నవీన్ కుమార్ యొక్క అత్యుత్తమ ప్రదర్శన జట్టు విజయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించింది, క్రీడలో అతని అంకితభావం మరియు ప్రతిభకు గుర్తింపును సంపాదించిపెట్టింది.

ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలలో చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా గోల్ కీపర్ నవీన్ కుమార్ ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, ప్రిన్సిపాల్ మహమ్మద్ షాహిద్దిన్,తదితర అధ్యాపకులు అభినందించారు.

# కిట్స్‌లో ప్రాంగణ ఎంపికలు



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, దివిలి గ్రామంలో గల ప్రముఖ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల నందు గురువారం విండ్‌కేర్ ఇండియా ప్రై.లిమిటెడ్ (ఉత్తరప్రదేశ్) సంస్థ వర్చువల్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించగా, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్ధులు ఎస్.మణికంఠ (మెకానికల్), ఎస్.సాయి శుభం (ఎలక్ట్రానిక్స్) ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డా.డి.మోహన్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్ధులను కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ సృజన్, ఇఓ జెన్నిబాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.శివలు మాట్లాడుతూ విద్యార్ధులకు నిరంతరం ప్లేస్‌మెంట్‌లో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు వారు తెలియజేశారు.

# భవిత నందు వరల్డ్ 'ఆటిజం డే'






**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రం నందు బుధవారం భవిత, సహిత ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్ధులకు వరల్డ్ ఆటిజం డే కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆటిజం పిల్లలచేత కేక్ కట్ చేయించి, ఆటిజం అవగాహన మరియు నివారణకు భవిత కేంద్రం సరైన మార్గమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, మహాత్మా గాంధి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, భవిత విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలేరు జలాలలోకి దిగి ఇద్దరు మృతి





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో ఇటీవలన నూకాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా యానం గిరియాలపేట నుండి వచ్చిన రెండు కుటుంబాలు దర్శనం కోసం రాగా వారిలో తిరుమడి నాగ విశాల వర్మ (9 సం.లు), కొప్పాడ బాబు (21 సం.లు) లు ఏలేరు జలాలలోకి స్నానానికి దిగి వీరు గల్లంతవ్వడంతో పెద్దాపురం పోలీసులకు సమాచారం అందడంతో సిఐ పి.విజయ్ శంకర్ సూచనల మేరకు ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ళ సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసి, పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రావులపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారిస్తాం





**– సుందరీకరణకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే సత్యానందరావు**

**రావులపాలెం, మేజర్ న్యూస్** : కోనసీమ ముఖ ద్వారం రావులపాలెం సెంటర్ లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. హైవే అధికారులు, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులతో కలిసి రావులపాలెం సెంటర్ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్థానిక అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన సదస్సు సమావేశంలో సత్యానంద రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోనసీమ ముఖద్వారం వద్ద మరియు ప్రతి శనివారం వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రావులపాలెం సెంటర్‌ను కూడా సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తామని, ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఇందుకు తగ్గట్టుగా అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే సత్యానందరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కె.వి. సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**– పిఠాపురం ప్రభుత్వాసుపత్రి**
**సూపరిండెండెంట్ డా పి.సుజాత**



**పిఠాపురం, మేజర్‌న్యూస్** : గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పి. సుజాత అన్నారు. ఆసుపత్రి నందు గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు సమయానికిఆహారం తీసుకోవాలని, ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున తగినంత మంచినీరు, లేదా ఇతర సూచింపబడిన పానీయాలు తీసుకోవాలని అన్నారు. సాధారణ డెలివరీలు ఎక్కువగా అయ్యే విధంగా ప్రభుత్వాసుపత్రి తమ వంతు ప్రయత్నాలు చేస్తుందని, ఇప్పటివరకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో సాధారణ డెలివరీల శాతం ఎక్కువగా నమోదు చేయడం జరిగిందన్నారు. గర్భిణీ స్త్రీలు ఎల్లప్పుడూ చురుకుదనంతో ఉండాలని, తమ పనులు తామే చేసుకోవాలని తద్వారా కాన్పు సులభం అవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు నెలకి 150 నుండి 180 వరకు డెలివరీలు అవుతున్నాయని, వీటిలో దాదాపు అన్ని సాధారణ డెలివరీలు జరుగుతున్నాయన్నారు.పిఠాపురం నియోజవర్గం నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతో నమ్మకంతో గర్భిణీ స్త్రీలు డెలివరీల కోసం వస్తున్నారని, ఇక్కడ తాము అందిస్తున్న చికిత్స మరియు వైద్య విధానంలో తీసుకుంటున్నటువంటి జాగ్రత్తలు ఆసుపత్రి పై వారికి నమ్మకం పెంచుతున్నాయని తెలిపారు. తద్వారా సిజేరియన్ శాతం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# పెద్దలను గౌరవించలేని విద్య వ్యర్థం



**– విద్యార్థులతో వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ**

**రాజానగరం, మేజర్ న్యూస్** : తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, పెద్దలను గౌరవించకుండా ఎంత ఉన్నత చదువులు చదివి అది వ్యర్థమే అని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లలో ప్రిన్సిపాల్ కార్యలయాలను, విభాగాలను, క్లాస్ రూమ్స్ ను, ల్యాబ్స్ ను వీసీ పరిశీలించారు. యూనివర్సిటీలోని టీచింగ్, నాన్ టీచింగ్ మరియు విద్యార్థుల హాజరు వివరాలు పరిశీలించారు. క్లాస్ రూమ్స్ ను పరితశీలించి విద్యార్థులతో మమేకం అయ్యారు. తాను వీసీ ాగా కాకుండా అమ్మలాగ చెబుతున్నానని, వర్క్ ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావంతో తల్లిదండ్రులు, గురువుల మీద జోక్స్ వేయడం, వారి మాటను లెక్కచేయకుండా ప్రవర్తించడం నన్నయ యూనివర్సిటీ విద్యార్థులకు తగదని చెప్పారు. మీ భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే తల్లిదండ్రులను ప్రేమించాలని, వారి మాటకు విధేయత చూపించాలని హితవు పలికారు. మేము ఉన్నత చదువులు చదువుతున్నాం, మాకు టెక్నాలజీ తెలుసు మా పెద్దవాళ్ళకు ఏమి తెలియదు అనే చులకన భావం, పెద్దల మాటను గౌరవించకపోవడం మూరు?ల లక్షణం అన్నారు. అటువంటి వారు ఎంత గొప్ప చదువు చదివిని అది వ్యర్థమే అన్నారు. యూనివర్సిటీలో సీనియర్, జూనియర్ అనే భావనతో ఎవరైన ర్యాంగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని, అందరూ సహోదర భావంతో చక్కని వాతావరణంలో ఒకే కుటుంబంగా మెలగాలన్నారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపక సిబ్బంది కూడా విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించాలని, ముఖ్యంగా పరీక్షల సమయంలో తల్లిదండ్రులుగా గురువులు ఆదరించాలని సూచించారు.

# స్మార్ట్ మీటర్లు మా ఇంటికి వద్దు

**– గోడ పత్రికలు ఆవిష్కరించిన సిపిఎం**




**పెద్దాపురం, మేజర్ న్యూస్** : అదానితో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రతీ ఇంటికి వేస్తున్న స్మార్ట్ మీటర్లు మాకు వద్దు అని తెలియజేస్తూ ప్రతీ ఇంటి ముందు స్టిక్కర్ అంటించాలని కోరుతూ సిపిఎం ప్రచురించిన స్మార్ట్ మీటర్లు మాకొద్దు అనే గోడ పత్రికను సిపిఎం నాయకులు బుధవారం పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఒక రూపాయి కూడా కరెంటు చార్జీలు పెంచమని చెప్పిందని, స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చిన లోకేష్ ఎక్కడ ఉన్నాడని ఆయన ప్రశ్నించారు. ప్రతీ చోట స్మార్ట్ మీటర్లు వేసి ఆదానికి మొత్తం విద్యుత్ రంగంను అప్పగించే కుట్ర జరుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజ లందరూ కలసి రావాలని, స్మార్ట్‌మీటర్లు మాకొద్దు అనే స్టిక్కర్ అంటించాలని, స్మార్ట్ మీటర్ వేయడానికి ప్రయత్నిస్తే వారిని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు, సిరపురపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు, గడిగట్ల సత్తిబాబు, చింతా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7 నుంచి ఎస్.ఏ-2 పరీక్షలు





పెద్దాపురం,మేజర్ న్యూస్ : ఈ నెల 7 నుంచి 17వ తేది వరకు 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 9వతరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు ఎస్.ఏ–2 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం డివైఇఓ ఈరంకి ప్రభాకర శర్మ, ఎంఇఓ–2 వి.ఆర్.కె.చౌదరిలు తెలిపారు. దీనికి సంబంధించి విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఏప్రిల్ 19 నాటికి మూల్యాంకనం పూర్తి చేయాలని, ఏప్రిల్ 21 నాటికి విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేయడం జరుగుతుందని, ఏప్రిల్ 23వ తేదిన ప్రొగ్రెస్ కార్డ్‌లు తిరిగి విద్యార్థుల నుండి తీసుకుని ప్రమోషన్ లిస్టులను అధికారులకు నివేదించడం జరుగు తుందని వారు తెలిపారు.

## పశువులు దాహార్తి తీర్చేందుకే నీటి తొట్టెలు

**– కింద్రలో భూమి పూజ చేసిన ఎంపీపీ వెంకటలక్ష్మి**



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్** : పశువుల దాహార్తి తీర్చేందుకే మండలంలోని ప్రతి గ్రామానికి ప్రభుత్వం నీటి తొట్లు ఏర్పాటు చేసిందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. ఏపీఓ రెడ్డి బాబు ఆధ్వర్యంలో బుధవారంమండలంలోని కింద్ర గ్రామంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీపీ భూమి పూజ చేసి ప్రారంభించారు. లబ్బర్తి, లాగరాయి శరభవరం గ్రామాల్లో పశువుల నీటి తొట్టెలు భూమి పూజ కార్యక్రమం ఏపీఓ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ లుకూటమి సభ్యుల సమక్షంలో జరిగింది. ఈకార్యక్రమంలోకింద్ర గ్రామ సర్పంచ్ బూసరి సత్యనారాయణ, మిరియాల గనిలక్ష్మి, మిరియాల సత్యవతి, గంపా నాగరాజు కూటమి సభ్యులు దేవగిరి వెంకటరమణ, చిట్టి సుబ్బారావు ,తూము సూరిబాబు, పేక ఆదినారాయణ, సూరిశెట్టి సురేష్, వాడపల్లి గంగరాజు, గ్రామస్తులు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెన్సీలో జీడి పిక్కలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**రంపచోడవరం, మేజర్ న్యూస్** : ఏజెన్సీ ప్రాంతంలో జీడి మామిడి పిక్కలు రైతులు దళారుల దగ్గర మోసపోకుండా జీడి మామిడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలం పందిరి మామిడి సెంటర్లో వందన్ వికాస కేంద్రం ద్వారా బుధవారం జీడిమామిడి పిక్కలు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో జీడి మామిడి పిక్కల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వందన్ వికాస కేంద్రాలు ద్వారా ఏర్పాటు చేసిన జీడిమామిడి పిక్కల కొనుగోలు కేంద్రాల్లో దళారులు బారిన పడి మోసపోకుండా అమ్ముకోవాలని సూచించారు. రంపచోడవరం డివిజన్ కేంద్రంలో జీడి మామిడి పిక్కల ప్రాసెస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయుటకు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వందన్ వికాస కేంద్రాలు అభివృద్ధి చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సంవత్సరం సుమారు 100 మెట్రిక్ టన్నులు జీడి మామిడి పిక్కలు కొనుగోలు కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అదేవిధంగా వచ్చిన ఆదాయం వందన్ వికాస కేంద్రాల సభ్యులకు సమానంగా పంచడం జరుగుతుందన్నారు. జీడి మామిడి రైతులు వందన్ వికాస కేంద్రాలలో జీడిపిక్కలు అమ్మేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ఒక్క కిలో జీడిమామిడి పిక్కలు 150 రూపాయలకు రైతులు నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జీడి మామిడి పిక్కలు తీసుకువచ్చిన రైతుల దగ్గర నుండి కిలో 150 రూపాయలు చొప్పున తూకాలపై అవగాహన కల్పించి కొనుగోలు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో 114 వందన వికాస కేంద్రాలు ఉన్నాయని, అదేవిధంగా 14 జీడి మామిడి పిక్కలు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దళారులు దగ్గర రైతులు మోసపోకుండా జీడిమామిడి పిక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ సంవత్సరం 100 మెట్రిక్ టన్నులు జీడి మామిడి పిక్కలు కొనుగోలు చేసి ప్రోసెసింగ్ అనంతరం మార్కెట్ కు పంపడం జరుగుతుందని, అదేవిధంగా 10 మెట్రిక్ టన్నుల చింతపండు, 20 మెట్రిక్ పసుపు, లక్ష కొండ చీపుర్లు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు. విడివికేలు ఏర్పాటు చేసిన జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలలో జీడిపిక్కలు అమ్ముకొని ఈ ప్రాంత గిరిజనులు అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించాలన్నారు. కొంతమంది వీడి వీకే సభ్యులకు అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విడీవికేలు అభివృద్ధి చేయుటకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిడి దేగలయ్య, డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఎపీఎం రాము, కామేశ్వర స్వామి, యాంకర్ పర్సన్ రామరాజు, వీడి వీకె సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై వీడియో కాన్ఫరెన్స్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇటీవల కాలంలో పెరుగుతున్న అగ్నిప్రమాద సంఘటనలకు సంబంధించి గత సంవత్సరంలో జరిగిన బాణాసంచా అగ్ని ప్రమాదాల వివరాలు, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై భారత ప్రభుత్వం హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ న్యూఢిల్లీ నుంచి బుధవారం ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలోని అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాల కలెక్టర్లుతో ఎన్డీఎంఏ హెచ్వోడిలు ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్కు జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు కాగా, కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఏఎస్పీ మానిష్ పాటిల్ దేవ రాజ్, అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేష్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



**- జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మనం ఉండే పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యకర సమాజం సాధించుకోవచ్చుని జిల్లా మలేరియా అధికారి నక్క వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ల్యాబ్ తనిఖీ చేసి ప్రతి జ్వర కేసుకి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించి పాజిటివ్ కేసులను సకాలంలో వైద్యం అందించాలని, అలాగే గ్రామ పరిసరాలలో దోమలు అభివృద్ధి చెందకుండా మురుగునీటి ప్రదేశాలు, నీరు నిల్వ ప్రదేశాలలో నీటి నిలవ లేకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని, ప్రతి నీటి గుంట ప్రదేశాలలో అబెట్ మందును పిచికారి చేయడం ద్వారా దోమల లార్వా అభివృద్ధి చెందకుండా నివారించవచ్చని, మలేరియా, డెంగ్యూ, మరియు ఇతర దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులను నిర్మూలించవచ్చని తెలియజేశారు.

ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని ఇతర రాష్ట్రాల నుంచి ఇతర జిల్లాల నుంచి పనులను నిమిత్తము వచ్చు వలస కార్మికులకు తరచూ రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ పి.సౌమ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సూపర్వైజర్లు సూర్యనారాయణ, అనిల్, విజయ, భాను తదితరులు ఉన్నారు.

# చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానంకు అనుమతి కొరకు కలెక్టర్‌కి పిర్యాదు



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట మున్సిపల్ చైర్పర్సన్‌గా ఉన్న గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి పై అవిశ్వాస తీర్మానం ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సన్ మోహన్ కు కౌన్సిలర్లు నేతల హరిబాబు, జాన్ మోజేష్, ఆవాలు లక్ష్మీనారాయణ, తదితరులు బుధవారం కలెక్టర్ కలిసి తమ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వైసిపి కౌన్సిలర్‌లు మాట్లాడుతూ చైర్ పర్సు౦ పై అవిశ్వాసార తీర్మాణం పెట్టి మెజార్టీ అభ్యర్థిని చైర్ పర్సన్‌గా నియమించాలని వారు కలెక్టర్ని కోరారు.. మొత్తం 22 మంది కౌన్సిలర్లు సంతకాలతో జిల్లా కలెక్టర్ ను,మున్సిపల్ కమిషనర్ ను కలిసి వినతిపత్రాలు అంద చేశారు.

# జనవాణిలో మంత్రి కందుల దుర్గేష్ ప్రజల నుంచి నేరుగా అర్జీల స్వీకరణ

**- నిడదవోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో పలువురి సమస్యలను స్వయంగా విన్న మంత్రి దుర్గేష్**
**- త్వరితగతిన సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ**



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** ప్రజలకు అందుబాటులో ఉండాల ంటూ జనవాణి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ప్రజలు, పార్టీ శ్రేణుల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. గంటల తరబడి ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. అండగా ఉంటామని భరోసానందించారు. తామున్నదే ప్రజలకు సేవ చేయడానికని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్పందన పట్ల వినతులు సమర్పించిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# ఉత్సవాలను జయప్రదం చేయాలి



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ఈనెల 6నుండి వారం రోజులపాటు జరగనున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి కళ్యాణోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. బుధవారం కళ్యాణోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను, కరపత్రాలను ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి మాట్లాడుతూ భక్తులకు చేస్తున్న వసతి సౌకర్యాలని ఎమ్మెల్యేకి వివరించారు. నిత్యాన్నదానం పథకం ద్వారా గతంలో శని, ఆదివారాల్లో మాత్రమే అన్న సంతర్పణ చేసేవారమని, ఇప్పుడు నిత్యం జరిగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈవోను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.ఎస్.రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మాస్ స్పోర్ట్స్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్

**– పాటియాలాలో ఆరు వారాల సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానము**
**– డీఎస్డివో డి.ఎం.ఎం.శేషగిరి వెల్లడి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు వివిధ క్రీడాంసల్లో ఆరు వారాల సర్టిఫికేషన్ కోర్సు-2025 నకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి.ఎం.ఎం.శేషగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. సామూహిక మాస్ స్పోర్ట్స్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ క్రింద స్పోర్ట్స్ కోచింగ్‌లో సిక్స్ వీక్స్ సర్టిఫికేట్ కోర్సు మే 6 నుండి జూలై 2, 2025 కాలమునకు గాను 29 క్రీడాంశములలో ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థులు నుండి కోర్స్ చేయుట కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పాటియాలా డిప్యూటీ డైరెక్టర్ సాయి తెలియజేసినారని పేర్కొన్నారు. విలువిద్య, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, కానోయింగ్ & కయాకింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, ఖో-ఖో, రోల్‌బాల్, రోయింగ్, సాఫ్ట్ బాల్, షూటింగ్, స్విమ్మింగ్, టైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, వుషు, యోగాసనం క్రీడాంశాలలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులపై ఆసక్తి గల తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థులు https://www. 6wcc. nsnis.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియచేశారు. దరఖాస్తుచేయుట కొరకు ఆఖరితేది ఏప్రియల్ 14వ తేదీ,ఇతర సమాచారము కొరకు https://www. 6wcc.nsnis.in వెబ్‌సైట్‌ను సందర్శించగలరని విజ్ఞప్తి చేశారు.

# గిరిజన గ్రామాల్లో రామకృష్ణ మిషన్ బట్టలు పంపిణీ





**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని లోతట్టు గ్రామాల్లో గిరిజనులకు రామకృష్ణ మిషన్ బట్టలు పంపిణీ చేసినట్లు మిషన్ నిర్వాహకులు తెలిపారు. రామకృష్ణ మిషన్ రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలో బొడ్లంక, చావడికోట పంచాయతీలు పరిధిలోని లోతట్టు గ్రామాలతో పాటు వై.రామవరం మండలం ఎగువప్రాంతానికి చెందిన గిరిజన గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చీరలు, దుస్తులు, 211 మందికి రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామి రఘువీరానందజీ మహారాజ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శారదమాత రాజమహేంద్రవరం వచ్చి 114 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ ఆధ్వర్యంలో సుమారు 1.30లక్షలతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు రామకృష్ణ మిషన్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్లంక సర్పంచ్ సాదల ప్రేమ్ కుమార్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాలరాజ్‌కుమార్‌రెడ్డి, వెదురునగరం జీవీకే స్కూల్ రిటైర్డు ఉపాధ్యాయుడు పి.సాయి ఫణి కుమార్, వాలంటీర్లు భగీరథ రాజు, శ్రీకాంత్, శశి, లక్ష్మణ్,విజయ్ పాల్గొన్నారు. కాగా బొడ్లంకలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులుతో రఘువీరా నందజీ, సాయి ఫణి కుమార్, వివేకానందుని బోధనలు, ఏకాగ్రత సమయ పాలన, వ్యక్తిత్వ వికాసం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజయానికి మార్గం పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ గొర్లె నాగరత్నం పాల్గొన్నారు. ముందుగా రామకృష్ణ మిషన్ స్వామిజీలకు గిరిజనులు స్వాగతం పలికారు.

# 4వ తేదీ నుండి వెంకన్న కళ్యాణ మహోత్సవాలు



**– ఈఓ వెంకటేశ్వరరావు**

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** పెళ్లిళ్ల వెంకన్నగా ప్రాచుర్యం పొందిన మహిపాల వీధి భూసమేత వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 4 నుండి 13 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న లు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడో తారీకుఉదయం 9:49 నిమిషాలకు విఘ్నేశ్వరుని మీది కట్టుట, పందిరిరాట ముహూర్తం అని, 4న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెళ్ళి కుమార్తెలను చేయడం జరుగుతుందన్నారు. 7వ తారీఖు ఉదయం 8.58 ని.లకు స్వామివారి కళ్యాణం, అలాగే 8 మధ్యాహ్నం 3.15 నిమిషాలకు రథోత్సవం జరిపించుటకు దైవజ్ఞులు నిర్ణయించారని తెలిపారు. 10 సాయంత్రం 6.32 నిమిషాలకు ఆలయ కోనేరులో స్వామి, అమ్మవార్లకు శేష వాహనంపై తెప్పోత్సవం జరుగుతుందన్నారు. 12న పూర్ణాహుతి, చక్రస్నానం, 13న స్వామి,అమ్మవార్లకు ఉయ్యాల సేవోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు. ఈ వేడుకల్లో భక్తులు యావన్మంది పాల్గొని స్వామివారి కళ్యాణ మహోత్సవాలను దిగ్విజయం చేయాలని ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే వినతులు స్వీకారం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రజలు నుండి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. రంపచోడవరం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఎటపాక,వి.ఆర్.పురం, దేవీపట్నం, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి మండలాల నుంచి ప్రజలు ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చి వారి సమస్యలు తెలియజేశారు. రంపచోడవరం గ్రామంలోని ముఠా దారి వీధికు సిసి రోడ్డు మంజూరు చేయాలని, అడ్డతీగల మండలం చాపరాయి గ్రామానికి నూతనంగా కరెంటు స్తంభాలు, ఎటపాక కృష్ణవరం లో కల్వర్టు, పూడిక తీత, అంగన్వాడీ కేంద్రం నిర్మాణంతో పాటు పలు సమస్యలపై ప్రజలు వినతులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రజలు నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి, వాటి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, క్లస్టర్ ఇన్చార్జి కారం సింహాచలం, యూనిట్ ఇంచార్జి సిద్దా వెంకన్న, ప్రసాద్, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణానికి జే.కే.సి.టి. ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ రేకులు పైపులు అందజేత




**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలో బుధవారం నవమి సందర్భంగా ఈ నెల 6న చింతూరు మండలం కుమ్మూరు గ్రామంలో సీతారాముల కళ్యాణం కార్యక్రమాన్ని స్థానిక ఆదివాసి గ్రామస్తులు ఏర్పాట్లలో భాగంగా రాములవారి కళ్యాణానికి గాను ఏర్పాట్లకై ఆయుర్వేద వైద్యులు జే.కె.సి.ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ను గ్రామస్తులు సంప్రదించి సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానిస్తూ కళ్యాణం నిర్వహించేందుకుగాను ఏర్పాట్లకు సాయం కోరగా 10 సిమెంటు రేకులు, పది ఇనుప పైపులను కళ్యాణ నిర్వహణకు జమాల్ ఖాన్ తన వంతు సహాయంగా గ్రామస్తులకు అందజేశారు. కళ్యాణ మహోత్సవానికి గ్రామస్తులు జమాల్ ఖాన్ ను ఆహ్వానించారు. నవమికి జమాల్ ఖాన్ చేసిన సహాయానికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అడిగి చంద్రయ్య, నగేష్, అర్జున్, దుర్గయ్య, చిన్నోడు, ధోని, లక్ష్మణ్ ప్రసాద్ శశాంక్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాకు అంతరాయం

**కాకినాడ, మేజర్ న్యూస్** సామర్లకోట నుండి శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చు రా వాటర్ 1500 ఎం.ఎం మెయిన్ లైన్ లీక్ రావడం వలన సదరు పైప్ లైన్ లీకేజి రిపేర్లు చేయుటకు గాను 3వ తేదీ సాయంత్రం నుండి 4వ తేదీ సాయంత్రం వరకు మంచినీటి సరఫరా నిలుపుదల చేయబడుతుందని కాకినాడ నగరపాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 5వ తేదీ ఉదయం మంచినీటి సరఫరా యధావిధిగా ఇవ్వబడుతుందన్నారు. కావున శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుండి మంచినీటి సరఫరా జరుగు రిజర్వాయిర్లు (శ్రీవిద్య కాలనీ (డి-మార్ట్), దుమ్ములపేట, శ్రీనివాస బ్యాంకు కాలనీ (గ్రిగోలపాడు), (4,6,7,8,9,10,11, 12,13, 49 మరియు 50 వార్డులు) ఏరియా పరిధిలో ఉన్న ప్రజలు ముంద స్తుగా మంచినీటిని నిల్వ చేసుకుని నగరపాలక సంస్థకు సహకరి చవలసినదిగా కోరారు. మంచినీరు అత్యవసరమైనచో నీటి సరఫరా ట్యాంకర్లు ద్వారా పంపుటకు గాను 9848471415, 6301387834, 9676770461, 7382042977 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# కోటలో రాజకీయం వేడెక్కుతుంది చైర్మన్ మార్పునకు ప్రయత్నం

**– బల నిరూపణకు కలెక్టర్‌ను అనుమతి కోరిన కౌన్సిలర్‌లు**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీలో రాజకీయాలు వేడుక్కుతున్నాయి. మున్సిపల్ చైర్ పర్సన్ ను మార్పు చేసుకునేందుకు గానూ (బల నిరూపణ) అవిశ్వాస తీర్మానానికి అనుమతి కోరుతూ బుధవారం పలువురు వైసీపీ కౌన్సిలర్ లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అయిన షాన్ మోహన్ సగిలి ని కోరితూ లెటర్ అందించినట్టు తెలిసింది. ఈ మధ్య కొద్ది నెలలుగా మున్సిపాలిటీలో చైర్ పర్సన్ మార్పునకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు పుకార్లు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగానే తాజాగా 22 మంది వైసీపీ కౌన్సిలర్ల సంతకాలతో కూడిన లెటర్ ను కొందరు కౌన్సిలర్ లు 22 మంది కౌన్సిలర్‌ల పక్షంగా తీసుకుని జిల్లా కలెక్టర్ ను కలిసి సమర్పించినట్టు తెలిసింది. ఈ సందర్బంగా సామర్లకోట మున్సిపాలిటీ లో చైర్ పర్సన్ ను మార్పు చేసుకునేందుకు గానూ బల నిరూపణ కు అనుమతిని ఇవ్వాలని కౌన్సిలర్ లు కలెక్టర్ ను కోరినట్టు తెలిసింది. అనంతరం కలెక్టర్‌కు అందించిన లెటర్ కాపీని స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీ విద్యను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, వైసీపీ కౌన్సిలర్ లు పాగా సురేష్, ఆవాల లక్ష్మీ నారాయణ, యార్లగడ్డ జగదీశ్, నేతల హరిబాబు, వైసీపీ నాయకులు రెడ్నం దొరబాబులు సాయంత్రం మున్సిపల్ కమిషనర్ కు లెటర్ అందించిన వారిలో ఉన్నారు. ఈ విషయం పై కమిషనర్ ను వివరణ కోరగా మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశంలో బల నిరూపణకు గానూ ఒక సమావేశం ఏర్పాటుకు కౌన్సిలర్లు 22 మంది సంతకాలతో కోరినట్టు చెప్పారు. దీనిపై కలెక్టర్ విచారణ అనంతరం వారి సమావేశం ఏర్పాటుకు సమయం ఖరారు చెయ్యనున్నట్టు కమిషనర్ తెలిపారు. కాగా సుమారు 2నెలలుగా సామర్లకోట మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ మార్పునకు సన్నాహాలు జరుగుతున్నట్టు వస్తున్న పుకార్లు బుధవారం జరిగిన తంతుతో సుస్పష్ట మవుతున్నట్టు తెలుస్తోంది.

# ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం కోసం కృషి

**– ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే సత్యానందరావు**

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో వద్ద బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కారం వెంటనే జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు, ఈ ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో ప్రజల



వచ్చి సమస్యలపై వినతలు అందజేశారని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, మెర్ల గోపాలం, కాస సాగర్, సాధనల శ్రీను మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా కారాగారాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీ లక్ష్మి




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** బుధవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్. శ్రీ లక్ష్మి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని మరియు ప్రత్యేక మహిళ కారాగారాన్ని సందర్శించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి అందరికీ తెలియజేయాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కారాగారంలోని వసతులను, సదుపాయాలను పరిశీలించిన అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, ఖైదీల తరపున వాదించేందుకు న్యాయవాది లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని, ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలని అన్నారు.

వారికి ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వాలంటీర్ల ద్వారా కానీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా కానీ సంస్థకు తెలియజేయాలని అన్నారు. అనాలోచితంగా చేసే పనుల వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయని, ఏ పని అయిన చేసే ముందు మంచి చెడులు ఆలోచించుకోవాలని, చెడు సహవాసాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఖైదీలందరూ పరివర్తన చెంది న్యాయబద్ధమైన జీవనశైలిని అలవరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు

# అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ప్రారంభించిన శాసనసభ్యులు వనమాడి కొండబాబు





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆంధ్ర పాలిటెక్నిక్ నందు నూతనంగా నిర్మించిన నూతన పరిపాలన భవనాన్ని శాసనసభ్యులు వనమాడి కొండబాబు, శాసనమండలి సభ్యులు కర్రీ పద్మశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర పాలిటెక్నిక్ నందు సుమారు నాబోర్డు ఆర్.ఐ.డి.ఎఫ్. నిధులు నాలుగు కోట్ల రూపాయలతో నూతన పరిపాలన భవన నిర్మించడం జరిగిందని, గత తెలుగుదేశ ప్రభుత్వ హయంలో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టగా గత ఐదేళ్ల ఫారంలో వాటిని పూర్తి చేయలేకపోయారని, ఆంధ్ర పాలిటెక్నిక్ నందు కొన్ని బ్లాకులు శిధిలావస్థకు చేరుకోవడం జరిగిందని, రాబోయే కాలంలో వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య డైరెక్టర్ పద్మారావు, ప్రిన్సిపాల్ నల్లి జనార్ధన్‌రావు, ప్రాంతీయ సంచాలకులు జే.సత్యనారాయణమూర్తి, ఆధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

**– అటవీశాఖ అధికారి**

**ఎటపాక,మేజర్‌న్యూస్ :** ప్లాస్టిక్ రహిత సమాజమే మన ధ్యేయం నెల్లిపాక అటవీశాఖ రెంజ్ అధికారి అన్నారు. బుధువారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ఫారెస్ట్ తనిఖీ కేంద్రం వద్ద ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహనా సదస్సును నిర్వహించడం జరిగింది. ఏప్రిల్ ఒకటి నుండి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిద్దామన్న జిల్లా కలెక్టర్ పాడేరు వారి ఆదేశాలను అనుసరించి డివిజనల్ అటవీశాఖ అధికారి చింతూరు వారు, వారి సిబ్బంది నేల్లిపాక అటవీ క్షేత్ర పరిధిలో గల చోడవరం బోర్డర్ చెక్పోస్ట్ వద్ద ఏప్రిల్ ఒకటి నుండి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రయాణికులకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిద్దాం, హరితాంధ్ర ప్రదేశ్‌ను సాదిద్దాం అన్న నినాదంతో ముందుకు వెళుతున్నారు. అటవీ క్షేత్ర అధికారి నెల్లిపాక వారు మాట్లాడుతూ ఇకనుండి చెక్‌పోస్ట్‌ల వద్ద వాహనములందు ఎవరైనా ప్లాస్టిక్ ను ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను తీసుకుని ప్రయాణం చేయవద్దని, చేతి సంచులను వినియోగించవలెనని వారు తెలిపారు. అటవీ ప్రాంతాలలో ప్లాస్టిక్ వేసినచో అటవీ చట్టాలను చట్టాలను అనుసరించి కఠిన జరిమానా విధిస్తారని వారు హెచ్చరించారు.

## 75 శాతం ప్రైవేట్ ఆస్తి పన్ను వసూలు

**– కమిషనర్ శ్రీవిద్య**



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు చెందిన రూ. 8.77 కోట్లు ఆస్తిపన్ను బకాయిలు వసూలు కావలసి ఉండగా మార్చి 31వ తేదీ నాటికి రూ. 4.37 కోట్లు వసూలుచేసి 50 శాతం వసూళ్లు సాధించినట్లు సామర్లకోట మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య చెప్పారు. బుధవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్తులకు సంబంధించి ఐదుకోట్ల ఏడు లక్షల రూపాయలు వసూలు కావలసి ఉండగా మూడు కోట్ల 81 లక్షల రూపాయలు వసూలుచేసి 75 శాతం జరిగినట్లు చెప్పారు.

# మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు, కరెంట్ ఛార్జీలు తగ్గించాలి

– ఇంటింటికి సిపిఎం పోస్టర్ క్యాంపెయిన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** "మా ఇంటికి ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్ వద్దు", "కరెంట్ ఛార్జిలు తగ్గించాలి" పోస్టర్స్‌తో ఇంటింటికి సిపిఎం పార్టీ ప్రచార క్యాంపెయిన్లో భాగంగా పార్టీ రూరల్ కమిటి అధ్వర్యంలో ఇంద్రపాలెం అల్లూరి సీతారామరాజు సెంటర్లో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం కాకినాడ రూరల్ మండల నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, చిట్టూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో 8 సార్లు విద్యుత్ ఛార్జిలను పెంచి ప్రజలపై భారాలు మోపారని గుర్తుచేశారు. అప్పుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బాదుడే బాధుడు అనే కార్యక్రమంతో వ్యతిరేకించారని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలపై సర్దుబాటు ఛార్జీల బారాన్ని బాదుడే బాధుడును కొనసాగిస్తూన్నారని విమర్శించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం మరలా అదనంగా ఆదానితో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందంను అమలు చెయ్యడం వల్ల ప్రజలపై మరో పిడుగు వేస్తున్నారన్నారు. ఈ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ ధర సుమారు 12 వేల రూపాయల భారాన్ని కూడా ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్ బిగించడం వల్ల టైంఆఫ్‌డే విధానం అమలు చేసి ప్రజలు ఎక్కువ విద్యుత్ ఉపయోగించే సమయంలో యూనిట్కు అదనంగా ఛార్జిలు వసూల్ చెయ్యనున్నారని తెలిపారు. ఈ విధానం ప్రజలకు మరింత విద్యుత్ భారం కానున్నదని, దీనిని అమలు చెయ్యకూడదని డిమాండ్ చేసారు. ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం నాయకుడు లోకేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ను ఎవరి ఇంటికైనా బిగిస్తే పగలగొట్టమని పిలుపునిచ్చారని ఇప్పుడు ప్రజలు మీటర్లు పగల గొట్టలా ఉంచాలా అని ప్రశ్నించారు. ఆదానితో జగన్ ప్రభుత్వం చేసుకున్న అవినీతి ఒప్పందాన్ని రద్దు చెయ్యాలని డిమాండ్ చేసారు. అమెరికా అంతర్జాతీయ న్యాయస్థానంలో అవినీతి కేసు నమోదు చేసిన దీనిపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడకపోవడం, ఒప్పందాన్ని కొనసాగించడం దుర్మార్గమన్నారు. సెకితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి ప్రజలపై విద్యుత్ భారాలు ఉపసంహరించాలని కోరారు. ఏప్రిల్ నెల మొత్తం ఇంటింటికి తిరిగి స్మార్ట్‌మీటర్లు పెట్టవద్దని, విద్యుత్ ఛార్జిలు తగ్గించాలని స్టిక్కర్ను ఇంటింటికి అతికించి రాష్ట్ర ప్రభుత్వంకు ప్రజలు నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దింశెట్టి రామ కృష్ణ,టి.రాజా,మంజన్,కిరణ్,త్రిమూర్తులు,రోహిత్, వినుత్, కిరణ్మయి, సత్యవతి,వాసంశెట్టిచందర్రావు,అంకంసుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు

# పాస్టర్ ప్రవీణ్ మృతిని రాజకీయం చేయొద్దు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మత ప్రబోధకులు పాస్టర్ ప్రవీణ్ మృతిని రాజకీయం చేయొద్దని, త్వరలో అన్ని వాస్తవాలు వెల్లడవుతాయని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మహాసేన రాజేష్ అన్నారు. బుధవారం కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్ క్లబ్‌లో మహాసేన రాజేష్ జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి మిస్టరీగా మారిందన్నారు. ప్రవీణ్ మృతి ప్రమాదవశాత్తు జరిగిందని అనిపిస్తుందన్నారు. ఇదే అవకాశంగా కొందరు రాజకీయ పార్టీల నేతలు రాజకీయ కోణంగా చేస్తున్నారని ఆరోపించారు. ప్రవీణ్ పగడాల మృతిపై మాజీ ఎంపీ హర్షకుమార్, జూపూడి ప్రభాకర్, కే.ఎ.పాల్ రాజకీయం చేయాలని చూస్తున్నార న్నారు. క్రైస్తవ సంఘాలను పక్క దోవ పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎటువంటి అనుమానాస్పద గాయాలు ఏమి లేవని డాక్టర్లు పోస్టుమార్టం నివేదికలో చెప్పడం జరిగిందన్నారు. దయచేసి ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని, పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారని, త్వరలో దర్యాప్తు నివేదికలు వస్తాయని తెలిపారు.

# 5న రెల్లికులస్థుల మహా పాదయాత్ర



పిఠాపురం, మేజర్ న్యూస్ : ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు ఒకటి శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం పట్ల నిరసనగా పిఠాపురం రెల్లికుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ కు ప్రభుత్వం రిజర్వేషన్ రాష్ట్రంలో అత్యధికంగా వున్న రెల్లి ఉపకులాలకు ఒకటి శాతం రిజర్వేషన్ ఏమాత్రం సరిపోదన్నారు. 2011 కంటే రెల్లి కులస్తులు గణనీయంగా పెరిగారని చెప్పారు. రెల్లి దాని ఉప కులాలు 12 వరకూ వున్నాయని, ఇప్పుడు కొత్తగా బుడగా జంగం కులాన్ని ఈ ఒకటీశాతంలో చేర్చడం బాధాకరంగా వుందన్నారు. తాజా జనాభా సంఖ్య ప్రాతిపదికన రెల్లి ఉపకులాలకు రెండు శాతం రిజర్వేషన్ కేటాయించాలని, బేడా బుడ్గా జంగాలను వేరే గ్రూప్‌లో చేర్చాలని వారు డిమాండి చేశారు. జస్టిస్ రామచంద్ర కమిషన్ రిపోర్ట్ ను అనుసరించి రెల్లి కులస్తులు దళితుల్లోనే అత్యంత దయనీయ స్థితిలో వున్నారని గుర్తించి వారిని ప్రత్యేక గ్రూప్ గా రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. తమ నిరసన తెలపడానికి 5 వ తేదీ ఉదయం పది గంటలకు పిఠాపురం అగ్రహారం పశువుల సంత నుంచి వేలాదిగా ర్యాలీ ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకూ కొనసాగిస్తామ

# ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల వారిచే ఉచిత ఆన్ లైన్ పాలిసెట్ శిక్షణా తరగతులు



గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కోర్సులో వివిధ బ్రాంచ్ లలో ప్రవేశం కొరకు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి వారు నిర్వహించబోవు పోలీ సెట్-2025 ప్రవేశ పరీక్షకు ఉచిత ఆన్ లైన్ శిక్షణా తరగతులు ది. 03-4-2025 నుండి ప్రారంభించడం జరుగుతుందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్, ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా.నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్. కుమార్ మాట్లాడుతూ ఆసక్తి కల విద్యార్థులు తమ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ అవ్వవచ్చు అని గత సంవత్సరం ఇదే విధంగా విద్యార్థులు తమతమ ఇంటివద్ద నుండే శిక్షణ తీసుకొని అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని తెలియజేసారు. శిక్షణలో భాగంగా మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సబ్జెక్ట్ లపై తర్ఫీదు ఇవ్వడం మరియు రోజువారీ, వారాంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8489053404, 9505518 249,76610 42854 నందు సంప్రదించవచ్చు అని తెలియజేశారు.

# ఈ నెల 4,5 తేదీల్లో శాస్త్రీయ అనుభవ యాత్ర



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** శాస్త్రీయ విజ్ఞాన అంశాలపై ప్రత్యక్ష అనుభవం, అధ్యయనానికి తోడ్పడుతుందని ఆ దిశగా శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహించడం మంచి పరిణామమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. కోనసీమ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రాథమికస్థాయి ఐదవ తరగతి స్థాయి విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ నెల 4,5 తేదీల్లో శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ శాస్త్రీయ ప్రచార యాత్ర గోడ పత్రికన బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయము నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రాథమిక స్థాయి ఐదవ తరగతి స్థాయి విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ నెల 4, 5 తేదీల్లో శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయ అంశాలపై అవగాహన పెంచుకోవడానికి రెండు రోజుల పాటు సందర్శన యాత్ర విద్యా ర్థులకు ఎంతగానో ఉపక రిస్తుందన్నారు. ఈ సందర్శన మంచి ప్రేరణతో సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొంది స్తుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో కెరీర్ అవకాశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని, పరిశోధనల గురించి తెలుసుకోవడం ద్వారా నూతన ఆలోచనలు జనిస్తాయన్నారు. విద్యార్థులు ఈ సందర్శనలో ప్రశ్నలు అడగడానికి సంకోచించకూడదని, ప్రతి అంశాన్ని అడిగి తెలుసు కోవాలని సూచించారు. శాస్త్రీయ అంశాలపై పరిపూర్ణమైన అవగాహన పెంచుకోవడానికి, ప్రేరణ పొందడానికి ఒక మంచి మార్గమన్నారు. ఈ సందర్భంగా డిఈవో షేక్ సలీం భాష మాట్లాడుతూఈ యాత్రలో 132 మంది విద్యార్థులు, 20 మంది గైడింగ్ టీచర్లు పాల్గొంటారన్నారు. ఈ యాత్రలో వివిధ ప్రదేశాలను సందర్శించి, అక్కడి ప్రత్యేకత లు, శాస్త్రీయ విశేషాలు తెలుసుకొని, పూర్తి నివేదికను జిల్లా యంత్రాంగానికి అందజేయనున్నారు. మొదటిరోజు యానాం,అనకాపల్లి,జిల్లా సందర్శన, జిప్మర్ వైద్యరంగ పురోగతుల అవగాహన, బొటానికల్ గార్డెన్, వృక్షజీవ అధ్యయనం,మధ్యాహ్నంఎటికొప్పాక చెక్కబొమ్మలపరిశ్రమ-సంప్రదాయ హస్తకళలపై అవగాహన, సాయంత్రం విశాఖపట్నం ప్రయాణం,రాత్రి బస చేస్తారన్నారు. రెండవ రోజు శాస్త్రీయ వారసత్వ పరిశీలన, విశాఖపట్నంలో బౌద్ధ స్థూపాలు, తోట్లకొండ, బవికొండ సందర్శన, రుషికొండ బీచ్ సముద్ర తీర పర్యావరణ అధ్యయనం, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో సినీ నిర్మాణ సాంకేతికతలు, మధ్యాహ్నం ఐఎన్ఎస్ కురుసురా మ్యూజియం నావికా రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, టి-142 ఫ్లైట్ మ్యూజియం విమాన సాంకేతికతలు, సీ హారియర్ మ్యూజియం యుద్ధ విమాన పరిజ్ఞానం,విశాఖ మ్యూజియంచారిత్రక వస్తువుల పరిశీలన, సాయంత్రం రామకృష్ణ బీచ్&ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాం తి, మదింపు. కోనసీమకు తిరుగు ప్రయాణం. విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన, సాంస్కృతిక పరిజ్ఞానం,ఈఅనుభవాత్మక అధ్యయనం అందించడమే లక్ష్యంగా నిర్వహించబడుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, కే.మాధవి, జిల్లా సైన్స్ అధికారి జీ.వి.ఎస్. సుబ్రహ్మణ్యం,అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అధికారి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులు పట్ల వైద్యులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా వైద్యాధికారి ఎన్.వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఓబులంక గోపాలపురం పీహెచ్సీలను తనిఖీలు చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు అంటే కాకుండా మండలంలోని ఈటిగబట్టిలు కోళ్ల ఫారాలు పని చేస్తున్న కార్మికులు గుర్తించి తగు పరీక్షలు నిర్వహించాలని వారు కోరారు. డెంగ్యూ మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తత వహించాలని వారి పేర్కొన్నారు అలాగే రక్తలేమితో బాధపడుతున్న రోగులకు రక్తపోత మాత్రాలు అందించాలని వారు తెలిపారు. మీరు వెంట వైద్యాధికారి డాక్టర్ హసీనా, సబ్ యూనిట్ ఆఫీసర్ హెల్త్ సూపర్వైజర్ సామ్యూల్ రాజు తదితరులు ఉన్నారు.